క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని డ్యాం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిపేట, కొత్తబస్టాండు, సుంకులమ్మ మెట్టు, శేరెల్లి వీధి, గాంధీచౌక్, పాత కూరగాయల మార్కెట్, రాంనగర్, బీసీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, కుంటవీధి, చాపలమార్కెట్, దౌదర్‌పల్లి, పిల్లిగుండ్ల కాలనీ, అయిజ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంపత్‌కుమార్‌కు పీసీసీ ఇవ్వాలి

అలంపూర్: ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ పీసీసీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ రావు, అలంపూర్ మండల అధ్యక్షుడు అడ్డాకుల రాములు ఒక ప్రకటనలో కోరారు. సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలోనూ వెన్నంటి ఉండి కార్యకర్తలకు ధైర్యం చెప్పారన్నారు. పార్టీలో క్రమశిక్షణతో సేవలందిస్తున్న సంపత్ కుమార్ సేవలను గుర్తించి పీసీసీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



అయిజ: శాంతినగర్ పట్టణానికి చెందిన వడ్డె రాజు (30) నెల రోజుల క్రితం గుండె పోటుతో మృతిచెందాడు. ఆయనకు భార్య సుజాత, కూతుళ్లు హేమలత, జయలక్ష్మి ఉన్నారు. వడ్డె రాజు భార్య పుట్టినిల్లు అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల కావడంతో వడ్డెర సంఘం నాయకులు ఆమెను ఆదివారం పిలిచి రూ. 80 వేల నగదు అందజేశారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పాండురంగ, వెంకటన్న, చిన్న సోమన్న, జమ్మన్న, నరసింహులు, శేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

జేఈఈలో గద్వాల విద్యార్థి ప్రతిభ

గద్వాల రూరల్: జేఈఈలో గద్వాలకు చెందిన విద్యార్థి టి.సాయిధీరజ్ ఆల్‌ఇండియా స్థాయిలో 213 ర్యాంక్ సాధించాడు. సాయిధీరజ్ తల్లిదండ్రులిద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల కుటుంబసభ్యులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామా ప్రజలు కోరుతున్నారు. మూలమలుపుల వద్ద వాహనాలు వేగంగా వస్తూ ప్రమాదాలు అవుతున్నాయని పేర్కొన్నారు. నిత్యం వాహనాలు తిరుతున్నా మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

మానవపాడు: వర్షాకాలం ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం నెలకొరుగుతోంది. నిత్యం ఈ రోడ్డు గుండా చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, అలంపూర్‌చౌరస్తా మీదుగా వాహనాలు తిరుగుతుంటాయి. మానవపాడు శివారు ప్రాంతంలో రోడ్డు పక్కానే ఒరిగిన విద్యుత్ స్తంభం కనిపిస్తోంది. విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

గట్టు: ఆలూరు మాజీ సర్పంచ్ కుర్వ మల్లమ్మ సోదరుడు తిమ్మప్ప, అతని కుమారుడు వీరేంద్రపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు కొందరు దాడి చేసి గాయ పరిచారు. దీంతో ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తిమ్మప్ప తెలిపారు. ఆలూరు బస్టాండ్‌లో ఉండగా, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల ఆకారణంగా తనపై దాడి చేశారని, ఈ విషయాన్ని గమనించిన తన కుమారుడు వీరేంద్ర అడ్డురాగా, అతనిపై కూడా దాడి చేసి గాయ పరిచినట్లు పేర్కొన్నాడు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తిమ్మప్ప తెలిపారు.

ప్రభుత్వ భవనం నిరుపయోగమేనా?

- 42 ఏళ్ల క్రితం నిర్మించిన పోలీస్‌స్టేషన్
- ఐదేళ్ల క్రితం నూతనపోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం
- పట్టించుకోని పాత పోలీస్‌స్టేషన్ భవనం



నిరుపయోగంగా ఉన్న పాత పోలీస్ స్టేషన్ భవనం

అయిజ: పోలీస్ స్టేషన్ నిర్వాహణ కోసం గతంలో అయిజ పట్టణం గాంధీచౌక్‌లో పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించారు. 37 ఏళ్ల పాటు అదే భవనంలో పోలీస్‌అధికారులు విధులు నిర్వహించారు. ఐదు సంవత్సరాల క్రితం పట్టణంలోని ఉత్తనూరు రోడ్డు పక్కన నూతన పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించారు. పోలీసులు సిబ్బంది అక్కడికి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి పాత పోలీస్ స్టేషన్ భవనం నిరుపయోగంగా ఉంది. కొన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భవనాలు పట్టణంలో లేకపోవడంతో పాత పోలీస్ స్టేషన్ భవనాన్ని ఏదో ఒక శాఖకు సంబంధించిన అధికారులు వినియోగించుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా కొన్ని శాఖల అధికారులు వారి కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు పాత పోలీస్ స్టేషన్ భవనం తాము కార్యాలయంగా మార్చుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయితే పోలీస్ శాఖ అధికారులు మాత్రం విముఖత చూపుతున్నారు. పోలీస్ శాఖకు సంబంధించిన పనులకు పాత భవనాన్ని వినియోగించుకుంటామని చెబుతున్నారు కానీ, ఇంతవరకు ఆ భవనం నిరుపయోగంగానే ఉంది. భవనం సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

ఇరుకు గదుల్లో కార్యాలయాలు..

పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖలకు కార్యాలయ భవనాలు లేవు. ముఖ్యంగా వ్యవసాయ శాఖకు కార్యాలయం లేదు. మెప్మా కార్యాలయం లేదు. కొన్ని శాఖలకు కార్యాలయ భవనాలున్నా, ఇరుకుగా ఉన్నాయి. విద్యుత్ శాఖకు సంబంధించిన కార్యాలయం ఇరుకుగా ఉంది. మున్సిపల్ శాఖ కార్యాలయ భవనం శిథిలమైంది. స్టోర్ రూంలేదు. వివిధ శాఖల వారు ఇరుకైన భవనాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయ భవనం కూడా పూర్తిగా శిథిలమైంది. అద్దెభవనంలో గ్రంథాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు అనుమతించి భవనం స్వాధీనం చేస్తే ఏదో ఒక శాఖ అధికారులు ఆ భవనాన్ని సద్వినియోగం చేసుకొని, తమ విధులను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ససేమిరా అంటున్న పోలీస్ అధికారులు..

ఐదేళ్లుగా పోలీస్‌స్టేషన్ పాత భవనం నిరుపయోగంగా ఉన్నా, పోలీస్ శాఖ అధికారులు ఆ భవనాన్ని ఇతరుల పనులకు ఉపయోగించుకోవడంలేదు. కనీసం ఔట్ పోస్ట్‌కు కూడా ఉపయోగించుకోవడం లేదు. కనీసం ఇతర శాఖలకు కూడా భవనాన్ని అప్పగించడంలేదు. మూడు సంవత్సరాల క్రితం మున్సిపల్ శాఖ అధికారులు పాత పోలీస్‌స్టేషన్ భవనంను అప్పగించాలని పోలీస్ శాఖ ఉన్నతాధికారులను కోరారు. ఈ ఏడాది విద్యుత్ శాఖ అధికారులు కూడా కోరారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు.

సద్వినియోగం చేసుకోవాలి



పాత పోలీస్ స్టేషన్ భవనం గత ఐదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉంది. వివిధ శాఖల కార్యాలయాలకు భవనాలు లేవు. భవనాలు లేని శాఖలు పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లేదంటే పోలీస్ వారు ఆ భవనా న్ని ఏదో ఒక పనికి సద్వినియోగం చేసుకోవాలి. భవనం వాడుకలో లేకుంటే శిథిలమై పోతుంది. ఉన్నతాధికారులు స్పందించి ఏదో ఒక కార్యాలయంను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– నాగరాజు, అయిజ

ఔట్ పోస్ట్‌కు ఉపయోగించుకుంటాం



పట్టణంలో పాత పోలీస్ స్టేషన్ భవనం ఇప్పటి వరకు కాళీగానే ఉంది. ఇతర శాఖల అధికారులు ఆ భవనం సద్వినియోగం చేసుకుంటామంటున్నారు. అయితే దాన్ని ఔట్ పోస్ట్‌గా మార్చాలనే ఆలోచనలో పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు. ఎలెక్షన్‌ల సందర్భంగా బిజీగా ఉండడంతో ఆప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. త్వరలోనే పాత పోలీస్ స్టేషన్ భవనంను ఔట్ పోస్ట్‌గా మార్చే ఆలోచనలో ఉన్నాం. త్వరలోనే ఆభవనంను సద్వినియోగం చేసుకుంటాం.

– విజయభాస్కర్, ఎస్‌ఐ

స్టోర్ రూంకు ఉపయోగించుకుంటాం



మున్సిపల్ కార్యాలయం ఇరుకుగా ఉంది. సిబ్బంది పనిచేసుకోవడానికి కార్యాలయంలో తగినన్ని గదులు లేవు. స్టోర్ రూం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాము. పాత పోలీస్ స్టేషన్ భవనం ఖాళీగానే ఉంది. పోలీస్ శాఖ అధికారులు అనుమతిస్తే ఆభవనాన్ని సద్వినియోగం చేసకుంటాం.

– సత్యం బాబు, మున్సిపల్ కమిషనర్

నేడు బడిబాటపై ప్రత్యేక సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఎస్ఎస్ ఆడిటోరియంలో సోమవారం ఉదయం 11 గంటలకు బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

కళాశాలకు ప్రహరీ నిర్మించండి



మానవపాడు: మండలంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా ఇంత వరకు స్పందించలేదు. కళాశాల ఆవరణలోకి పశువులు, పందులు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ దృక్పథంతో ముందుకు



మాట్లాడుతున్న వెంకటస్వామి

అయిజ: విశ్వమానవాళి శ్రేయస్సుకోసం అంతర్జాతీయ దృక్పథాన్ని కలిగి, సమాజ మార్పు కోసం పోరాడేది సీపీఎం మాత్రమేనని జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని నినదించిన కారల్ మార్క్స్ స్ఫూర్తితో సీపీఎం అంతర్జాతీయ దృక్పథాన్ని కలిగి ప్రపంచంలో కార్మికులకు, పీడితులకు ఎక్కడ అన్యాయం జరిగినా వారికి సంఘీభావంగా సీపీఎం ఉంటుందన్నారు. కమ్యూనిస్టులు వసుధైక కుటుంబం భావంతో అంతర్జాతీయ దృక్పథాన్ని కలిగి విశ్వమానవాళి శ్రేయస్సు కోసం నిరంతరం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, నరసింహ, అయిజ మండల కార్యదర్శి ఈశ్వర్, రాజోళి మండల కార్యదర్శి విజయ్ కుమార్, నాయకులు పెద్ద రాముడు, సవారన్న, రంగన్న, నాగరాజు, భీముడు, చిన్న నరసింహ, తిరులి, వీరేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ

గద్వాల రూరల్: గద్వాల పట్టణం వేదానగర్ వీధికి చెందిన చేనేత కార్మికుడు అక్కల రఘు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు వైస్ చైర్మన్ బాబర్, గోవిందు, మురళి, నరహరి శ్రీనివాసులు, ధర్మనాయుడు, విజయ్, రాజు, షుకూర్ ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన మొద్దుల రాముడు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గట్టులో అధ్వానంగా రహదారి



గట్టులోని సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గట్టు: మండల కేంద్రంలోకి వచ్చే రహదారి అధ్వానంగా తయారైంది. విద్యుత్ సబ్‌స్టేషన్, వసతి గృహం సమీపంలో తారు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వర్షపు నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్, రైతు వేదిక వరకు ఉన్న ప్రధాన తారు రోడ్డు అధ్వానంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. మాచర్ల చెరువు నుంచి గట్టు లిఫ్టు కోసం నల్లమట్టిని టిప్పర్ల ద్వారా తలిస్తున్నారు. నిత్యం పెద్ద పెద్ద వాహనాల రాక పోకల వల్ల గట్టు బస్టాండ్‌లోని అంతర్గత రహదారి పూర్తిగా దెబ్బతిని ఇబ్బంది కరంగా మారింది. వర్షాకాలంలో వాహనాల రాకపోకల కారణంగా మరింత ఇబ్బంది ఏర్పడే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



ఉండవెల్లిలో బాణా సంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు



ధరూరులో సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: బీజేపీ నేత నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మా ట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, భీమసేన రావు, లక్ష్మణాచారి, భీమేష్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని బీజేపీ నాయకులు బాణా సంచా కాల్చుతూ, డప్పుచప్పుళ్లతో ర్యాలీ తీశారు. ప్రాగటూరు, మండల కేంద్రం, కంచుపాడు, పుల్లూరు, కలుగోట్ల, ఏ.బూడిదపాడు, గ్రామాల్లో బీజేపీ యుకులు బాణా సంచా కాల్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పిడుగు వెంకటేష్, జిల్లా నాయకులు నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో బీజేపీ నాయకలు లక్ష్మీనారాయణ, వెంకటపతి, వెంకటేష్, కుర్మన్న, చెన్నిపాడు యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. యువకులు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేకేరెడ్డి, సంపత్, సత్యం, నర్సింహ, రామకృష్ణ, జనార్దన్ రెడ్డి, నరేష్, మహేష్, ఉన్నారు.

ధరూరు: మండలంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కొత్తపాలెం, మాల్‌దొడ్డి, అల్వలపాడు గ్రామాల్లో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి, జిల్లా ఉపాధ్యక్షులు కురువ కిష్టన్న, ప్రతాప్, శేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, మల్లకల్, ఆంజనేయులు, కృష్ణ, ఆంజనేయులు, వెంకట్రాములు, జయన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

శాంతినగర్: నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేసినందున బీజేపీ పార్టీ శ్రేణులు శాంతినగర్‌లో సంబరాలు చేశారు. కార్యక్రమంలో నరసింహ, ఆంజనేయులు, రంగస్వామి, పరశురాముడు, అయ్యరాజు, దురేంద్రయాదవ్, రఘు, నాగరాజు, మహేష్, మోహన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల దుస్తుల పంపిణీ



బూరెడ్డిపల్లిలో ఉపాధ్యాయులకు విద్యార్థుల యూనిఫాంను అందజేస్తున్న ఐకేపీ సిబ్బంది

ధరూరు: మండలంంంంలోని బూరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాంను పంపిణీ చేశారు. ఆదివారం ఐకేపీ సీసీ జయరాజ్ వీఓఏ, వీఓఏ రాధమ్మ, లలితమ్మ, తిమోతిలు పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. మరో రెండు రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి పాఠశాలకు యూనిఫాంను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు



జోగుళాంబ ఆలయంలో సినీ నటుడు అశోక్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్‌రావుతోపాటు సినీ నటుడు అశోక్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యవసాయంలో కాడెడ్ల జాడేది?

- ట్రాక్టర్ల ద్వారానే వ్యవసాయ పనులు
- రైతులపై పెరిగిన ఆర్థిక భారం
- ఊపందుకున్న వ్యవసాయ పనులు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

కేటీదొడ్డి: వ్యవసాయ పనుల్లో అన్నదాతలు ఆసరా ఉండే కాడెద్లు కనుమరుగయ్యాయి. యంత్రాలు, ట్రాక్టర్ల వాడకం పెరిగిపోవడంతో పంటల సాగు రైతులకు భారంగా మారుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయం చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పశుపోషణ భారంగా మారడంతో యంత్రాల వాడకం పెరగడంతో కాడెద్లు వ్యవసాయ పనులకు దూరమయ్యాయి. ట్రాక్టర్ల యాజమానులు గంటకు రూ.1300 నుంచి రూ. 1500 వరకు డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆర్థికంగా భారమైన వ్యవసాయ పనులు చేయిస్తున్నారు.

భారంగా పశుపోషణ..

పశుపోషణ భారంగా మారడంతో రోజురోజుకూ వ్యవసాయంలో కాడెద్దుల వినియోగం తగ్గుతోంది. ఒక్కప్పుడు ప్రతి గ్రామంలో అధికశాతం రైతుల కుటుంబాల్లో కాడెద్దులు ఉండేవి, వాటితో వ్యవసాయ పనులు చేయించేవారు. వ్యవసాయ పనులకు యంత్రాలు రావడంతో కాడెద్దులు కనుమరుగయ్యాయి. రైతులు సైతం కాడెద్లు పెంపకానికి ఆసక్తి చూపించడం లేదు.



ట్రాక్టర్‌తో దున్నిన పొలం

పెరిగిన యంత్రాల వాడకం..

వ్యవసాయ పనులకు కూలీలపై ఆధారపడకుండా ట్రాక్టర్ల ద్వారా పనులు చేపడుతున్నారు. పత్తి కర్రను తొలగించేందుకు ఎకరానికి రూ.800 నుంచి రూ.1000 వరకు చెల్లిస్తున్నారు. దుక్కి దున్నేందుకు ఎకరానికి రూ.1300 నుంచి 1500 వరకు చెల్లిస్తున్నారు. విత్తనాలు వేసే సమయంలో భూమిని చదును చేయడానికి రోటవేటర్ కోసం ఎకరానికి రూ.100 నుంచి రూ.1400 వరకు చెల్లిస్తున్నారు. గ్రామాల్లో ఒక్కసారిగా ట్రాక్టర్ల డిమాండ్ పెరగడంతో కాడెద్దుల అవసరం పూర్తిగా తగ్గిపోయింది.

ట్రాక్టర్‌తోనే అన్ని పనులు..



గతంలో కాడెద్దులకు అరక కట్టి వ్యవసాయ పనులు చేసేవాళ్లం. పత్తి కర్రల తొలగించడం మొదలుకొని దుక్కి దున్నడం, చదును చేయడం కాడెద్దుల ద్వారా చేసేవాళ్లం. ఇప్పుడు వ్యవసాయ పనులకు ట్రాక్టర్‌ను వినియోగించాల్సి వస్తోంది.

– స్వామి, కేటీదొడ్డి

ట్రాక్టర్ వినియోగానికి పెరిగిన డిమాండ్..



వ్యవసాయ పనుల్లో కాడెద్ల వినియోగం తగ్గడంతో యంత్రాల వినియోగం పెరిగింది. దీంతో గ్రామాల్లో రైతులందరు ఒకేసారి పనులు చేయించుకునేందుకు ముందుకు రావడంతో డిమాండ్ పెరిగింది.

– వీరన్న, రైతు, కేటీదొడ్డి

హమాలీల సంక్షేమ కోసం పాటుపడాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గద్వాల అర్బన్: హమాలీ కార్మికుల సంక్షేమ కోసం సమగ్ర చట్టం తీసుకొచ్చి వారి సంక్షేమ కోసం పాటుపడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీలు వస్తు సేవల రవాణాలో వివిధ రకాల ఉత్పత్తి ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ సంపదను పెంచుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీల సంక్షేమం కోసం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం, వారి రక్షణ కోసం ఎలాంటి చట్టం తీసుకరాకపోవడం బాధాకరమన్నారు. హమాలీ కార్మికులు సేద తీరడానికి ప్రత్యేక అడ్డాలు ఏర్పా టు చేయాలన్నారు. 60ఏళ్లు పైబడిన ప్రతి హమా లీకి పింఛన్, ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ లు చేసే సంక్షేమ పథకాల్లో హమాలీ కార్మికులకు తొలి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉప్పేరు నర్సింహ, రంగన్న, బాలకృష్ణ, రామకృష్ణ, లక్ష్మన్న, రఘు ఉన్నారు.